# సింగిల్ పేజీ కథలు

## ఎవరు గొప్ప?

అదో అరణ్యం.

గలగల పారే సెలయేళ్లు, పచ్చదనాన్ని పరిచినట్లు చెట్లు, ఇసుకతిన్నెలతో ఉన్న ఆ ప్రాంతం అనేక రకాల పక్షులు, జంతువులకు నెలవుగా మారింది. అలాంటి ఆ ప్రదేశం ఒక చిన్న కుందేలు పిల్ల అల్లరితో, గెంతులతో సందడిగా మారింది. పగడాల్లా మెరిసే కళ్లతో, తెల్లగా మంచుపరుచుకున్నట్లు ఉన్న ఆ కుందేలు పిల్లంటే అక్కడి జంతువులకు అభిమానం ఏర్పడింది. అందరినీ వరసలు పెట్టి పిలుస్తూ కలిసిపోయే ఆ కుందేలు పిల్ల పుట్టి కొన్ని వారాలే అయినా అక్కడి వారికి ఆత్మబంధువైంది. ఎప్పుడూ చలాకీగా పరవళ్లు తొక్కే సెలయేరులా దూకే అది కాస్త పరధ్యానంలో పడింది. ఈ విషయం గమనించిన ఒక నక్క-

"ఏరా మనవడా, ఏంటలా ఉన్నావు. ఆరోగ్యం బాలేదా?" కుశలమడిగింది.

అక్కడి జంతువులన్నింటిలోకీ పెద్దదయిన ఆ నక్క తెలివైనదానిలా పేరు పొందింది. చిన్న చిన్న తగువుల్లో తగు న్యాయం చెప్పే ఆ నక్కంటే అక్కడి జంతువులకు గౌరవం.

"కాదు తాతా, మనసే బాగోలేదు."

"అయ్యో, నీ మనసుకేమయిందిరా?"

"ఒక సందేహమొచ్చింది తాతా, ఎంతకూ తెగడం లేదు."

"ఏంటది?"

"మనం గొప్పవాళ్లమా, మనిషి గొప్పవాడా?"

నక్క ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సరిగ్గా ఇదే ప్రశ్న తన మదిలో చిన్నప్పుడు ఉదయించింది. అప్పటి నుండి మనిషిని, అతని జీవన విధానాన్ని తన పరిధిలో విశ్లేషిస్తూ వచ్చింది.

"చెప్పు తాతా? మనం గొప్పా? మనిషి గొప్పా?" కుందేలు రెట్టించడంతో ఆలోచనలకు తెర దించి-

"ఒకరి సమక్షంలో గొప్పగా మాట్లాడి, అతని పరోక్షంలో ఎగతాళిగా మాట్లాడి ఆనందించడం గొప్ప లక్షణమైతే మనిషి గొప్పవాడురా"

"అర్థం కాలేదు తాతా"

"అర్థమయ్యే వయసు కాదురా నీది. ఇప్పుడే నీకెందుకు గానీ ఇవన్నీ, పోయి ఆడుకో పో" అంటూ అక్కడి నుండి కదిలింది నక్క. సంతృప్తి చెందని కుందేలు ఎవరినడిగితే బావుంటుందో ఆలోచిస్తుంటే మృగరాజే అందుకు తగినవాడని తోచి వడివడిగా అటు కదిలింది.

అక్కడి జంతువులకు రాజుగా అందరి అభిమానాన్ని చూరగొన్న మృగరాజు తనకు సమాధానమిస్తాడని అతడిని కలిసింది.

"బాబాయి, ఒక సందేహం తీరుస్తావా?"

"నీకేం సందేహంరా?"

"మనం గొప్పవాళ్లమా, మనిషి గొప్పవాడా?"

"వయసుకు మించిన ఆలోచనలు ఎందుకురా?" కసిరింది సింహం.

"చెప్పు బాబాయి" అంటూ పట్టుబట్టడంతో గొంతు విప్పక తప్పలేదు మృగరాజుకు.

"ఎదుటివారి ఆపదలో కూడా తనకేమయినా దొరుకుతుందేమోనని ఆశించడం, తన బాగు కోసం ఎంతటి



నీచానికైనా దిగజారడం వంటివి గొప్పవాళ్లకు మాత్రమే ఉండే లక్షణాలయితే మనిషే గొప్పవాడురా"

"పో బాబాయి. అర్థమయ్యేలా చెప్పడం లేదు."

"చెబితే అర్థమయ్యే విషయాలు కావురా ఇవి."

సంతృప్తి చెందని కుందేలు మళ్లీ వెదుకులాటలో పడింది.

"ఎక్కడికోయి, అంత ఆలోచనతో వెళ్తున్నావు?" నెమలి పలకరింపుతో దానికి ప్రాణం వచ్చినట్లయింది.

"ఒక సందేహం తీరుస్తావా అత్తా?"

"ఏంటది?"

"మనిషి గొప్పవాడా, తక్కిన ప్రాణులు గొప్పవా?"

నెమలి ఒక్క క్షణం ఆలోచనలో పడింది.

"మనసులో చీకటి ఉంచుకొని, వెలుగును ఇష్టపడుతున్నట్లు నటించడం, క్షణానికో మాట మాట్లాడుతూ దానికి లౌక్యం అని పేరు పెట్టుకొని పొంగిపోవడం గొప్ప లక్షణాలయితే మనిషి మనకంటే గొప్పవాడురా"

ఈ సమాధానంతోనూ సంతృప్తి చెందని కుందేలు ఎవరు తన సందేహాన్ని తీర్చగలరనే విషయంలో కొంత తర్జనభర్జన పడ్డాక చివరకు మనిషితో సహజీవనం సాగించే కోడి తనకు సమాధానమిస్తుందని తోచి జనారణ్యం వైపు పరుగుతీసింది. అప్పుడప్పుడు అరణ్యంలోకి వచ్చి కొత్త కొత్త విషయాలు చెప్పే కోడి అంటే దానికి అభిమానం. తన ప్రశ్నకు సమాధానం లభించబోతున్నందున సంతోషంతో కోడి నివాసానికి వచ్చి వెతకసాగింది. ఆ ప్రాంతంలో ఎక్కడా కనపడకపోయేసరికి ఆందోళన చెందింది. చివరకు మెడతెగి కొన ఊపిరితో ఉన్న కోడిని చూసి కుందేలు తల్లడిల్లింది. అతిథులకు విందు ఏర్పాట్లలో మునిగి ఉన్న మనిషి కంటబడకుండా అడవిదారి పట్టింది.

మనిషిలోని దుర్మార్గాన్ని తలచుకుంటూ వ్యధ చెందిన కుందేలుకు ఏదో బోధపడినట్లయింది. దగ్గరలోని చెరువులో దాహాన్ని తీర్చుకొని మర్రిచెట్టు నీడలో సేద తీరి ఇలా అనుకుంది.

"తను తినబోయే జంతువుతో సైతం చివరి క్షణం వరకూ కపట స్నేహం చేయగల మనిషిలో ఏమాత్రం గొప్పతనం ఉందో అర్థమైంది. సృష్టిలో ఏ ప్రాణికి లేని ఇంతటి నయవంచక లక్షణం కలిగి ఉన్న మనిషి గొప్పతనం తెలిసింది."

తన ప్రశ్నకు సమాధానం లభించిందన్న తృప్తితో అది గెంతులేసుకుంటూ ఆటలకు వెళ్లిపోయింది.

"అనుభవాన్ని మించిన జ్ఞానం ఏముంది"

-శ్రీధర్ భద్రంరాజు (నల్గొండ)